# అక్క పెళ్ళి

"ఆయనకేం? మహారాజు! ఇంకా ఇద్దరు కూతుళ్ళున్నా అవలీలగా సంబంధాలు తీసుకురాగలడు!" అని తనను గురించి ఎవరన్నా స్నేహితులు అనుకున్నప్పుడు శ్వేతాంబరానికి కొద్దిగా గర్వమూ, అంతకంటె ఎక్కువ భయమూ కలిగేవి.

తనశక్తిలో తనకే లేనినమ్మకం తనస్నేతుల కెందుకుండాలి? ఒకవేళ తాను హనుమంతుడల్లే తన శక్తిసామర్థ్యాలను గురించ లేకుండా ఉన్నాడా? అయితే, తనకూ, హనుమంతుడికీ ఒక్కవిషయంలోమటుకు పోలిక లేదు—హనుమంతుడు పొగిడితే విజృంభించేవాడు. దిక్కుమాలిన పొగడ్త తనను కుంగదీస్తోంది.

రెండుసంవత్సరాలుగా తాను కళ్యాణికి తగినవాడెక్కడన్నా దొరుకుతాడా అని వెయ్యికళ్ళతో చూస్తున్నాడు. భూమ్యాకాశాలమధ్య అటువంటి వాడెవడూ ఇంత

వరకు కనిపించలేదు. "ఎవరన్నా కాస్త సహాయపడండర్రా" అని ఆప్తులనూ, మిత్రులనూ అడుగుదామన్నా వాళ్ళు తన అసహాయస్థితిని గుర్తించేటట్టు లేరు.

"శ్వేతు పెద్దదానికింకా పెళ్లి చేశేడుకాడేం?"

"ఆఁ! ఇవాళ అనుకున్నాడంటే రేపు చేసేస్తాడు. మనవాడికది ఏమంత కష్టమైన పని కాదులే!"

తన బంధువులిద్దరిమధ్య జరిగిన ఈసంభాషణను శ్వేతాంబరం తన చెవులారా విన్నాడు. తాను వింటున్నట్టు వాళ్ళకి తెలీదు; అందుచేత అవి ఇచ్చకాలమాట. లనుకోవటానికి లేదు...

అవును, తన అసమర్థత ఒక్కరూ గమనించరు. ఆ కారణంచేత తాను బొత్తిగా ఒంటరిగాడై పోయినాడు. అంతకంటె తనకు కలిగిన లాభం ఆవగింజంతకూడా లేదు. అన్ని విషయాలలోనూ తనను నిశితంగా విమర్శించే తనభార్య గుణమణికూడా, "మీరు పనిపెట్టుకొని వెతికితే క్షణంలో దానికి సంబంధం కుదరకపోయిందా? మీకసలు ఈగవాలినట్టయినా ఉంటేగా?" అంటుందితప్ప, "ఇది నీవల్లఅయే పనికాదు. మరెవరికన్నా పురమాయించు," అనదు...

తనలో ఇంతమందికి విశ్వాసం ఉండటానికిగల కారణాలు శ్వేతాంబరానికి తెలియకపోలేదు. ఆ రేడువందల రూపాయల జీతగాడు, పలుకుబడిగలవాడు, "నాకూతురికి పెళ్ళిచేస్తున్నాను!" అన్నాడంటే ఎంతమందో కుర్రాళ్ళు ఎగబడకపోతారా అని కొందరు బధువుల నమ్మకం! ఎంత

మంది స్నేహితుల కూతుళ్లతో సంబంధాలు కుదిర్చాడు. తన కూతుళ్ళకు కుదర్చలేడా అని మరికొందరి ఉద్దేశం!

ఇదంతా నిజమేఅనుకున్నా, కళ్యాణికి మొగుణ్ణి తీసుకురావటానికి చిన్నమెత్తు ఉపకరించలేదు—అది అసలైననిజం. కొందరు పెద్దమనుషులు తమకు తామైవచ్చి, "మీపిల్లను మావాడికి చేసుకుంటాం," అని అడగటమూ, ఇతరులద్వారా అడిగించటమూ జరిగింది కాని అట్లా వచ్చిన సంబంధాలలో ఒక్కటికూడా గుణమణి ఆమోదించలేదు.

గుణమణి ఆక్షేపించుటలో అఖండురాలు. ఎటువంటి వాళ్ళకైనా వంకలు పెడుతుంది—వాళ్ళంటే తనకు ఇష్టం లేకపోతే! "ఆవిడకి హృదయనేత్రమేతప్ప మనోనేత్రంలేదు—ఒకప్పుడుండేదేమో, ఇప్పుడు పువ్వేసిపోయింది" అని ఒక కవిమిత్రుడు తాను పూర్వం ప్రేమించిన ఒక గొప్పయింటి ఇల్లాలినిగురించి శ్వేతాంబరందగ్గిర విరక్తిగా అన్నాడు. ఆ వర్ణన గుణమణికికూడా వర్తిస్తుందని శ్వేతాంబరానికి ఎన్నోసార్లు అనిపించింది. గుణ మానవులందర్నీ రెండుతరగతులుగా విభజించింది—తన కిష్టులైనవాళ్ళూ, కానివాళ్లూనూ! ఇష్టులైనవాళ్ళలో ఆమెకు ఏ ఒక లోపమూ కనిపించదు. అథవా కనిపించినా ఎంతో హృదయవైశాల్యత కనబరిచి ఆ లోపాన్ని క్షమిస్తుంది, సమర్థిస్తుంది వీలయితే మెచ్చుకుంటుందికూడా!

గుణకి తన పెద్దకూతురు కళ్యాణిమీద చాలాప్రేమ. "పాపం, దానికి ఏమీ తెలీదు—సీత ఇంకా గడుసుదిగాని!

...అందుకే దానికి మంచి సంబంధం చూడాలి!" అనేది. ఈ 'మంచి సంబంధం ఎట్లాఉంటుందో శ్వేతాంబరానికి ఎన్నడూ అర్థంకాలేదు. కళ్యాణిని చేసుకుంటామనివచ్చిన సంబంధాలలో చాలాభాగం తనకునచ్చనిమాట నిజమేగాని తాను కష్టపడివెతికినా ఇంచుమించు అటువంటి సంబంధాలు తప్ప కళ్యాణికిరావని ఆయన నమ్మకం.

ఆమాట అంటే గుణ, "మీకు అదంటే తేలిక లెస్తురూ!" అంటుంది.

"నీకళ్లకి నీకూతురు రంభల్లే కనిపించగానేసరా?" అంటాడు శ్వేతాంబరం.

"అదే నాకర్థంకాదు. మీకళ్ళకిమాత్రం రంభల్లే ఎందుకు కనిపించకూడదూ? మీకూతురు కాకపోయిందా?" అంటుంది గుణ.

"నీమాదిరిగా ఆత్మవంచన చేసుకోవటం నాచేత కాదు."

"ఇష్టమైతే అన్నీ చాతవుతై."

"పోనీ ఇష్టంలేదే అనుకో!"

"ఎందుకు లేకపోవాలీ? అదే నాకర్థంకాదు"

"ఇష్టమైతే అదే అవుతుందని నేనుకూడా అన వచ్చా?"...ఒక పావుగంటసేపు ఈధోరణిలో పడ్డాక, తాము ప్రారంభించిన విషయానికీ మాట్లాడుతున్న మాట

లకూ సంబంధం లేకుండాపోయిందని శ్వేతాంబరానికి అర్థమయేది.

"నీతో ఏదిమాట్లాడాలన్నా చిక్కే. అసలువిషయం వదిలేసి ఎటో ఈడుస్తావు!" అని విసుక్కునేవాడాయన.

"నేనా! ఇంకానయం! మీరే ఈడుస్తారు—దాని పెళ్ళివిషయం ఎత్తితేచాలు మీకు కోపం! అదంటే మీకు బొత్తిగా గిట్టదు. అందుకని మీరే మాటమార్చేసి, ఇంకేదో మాట్లాడతారు" అనేది గుణ పూర్తి నమ్మకంతో.

తనభర్తకు కళ్యాణిఅంటే ఇష్టంలేదని రుజువుచెయ్యటానికి గుణమణిదగ్గిర బోలెడంత సాక్ష్యంవుంది. ఊళ్ళో వాళ్ళందరికీ సంబంధాలు కుదర్చగలడుగాని, తనకూతురుకి కుదర్చడు! తాను పెళ్ళికొడుకుతండ్రి అయినట్టుగా లోపాలెన్నుతాడు! అదికూడా ఎందుకు?—మంచిసంబంధం వెతక్కుండా తప్పించుకోవటానికి. సరస్వతమ్మగారి సుశీలకు ఈయనేగా సంబంధం కుదిర్చిందీ! దానికి అంతమంచిమొగుడు వస్తాడని సరస్వతమ్మ కలలోనైనా అనుకొని ఉంటుందీ? ఊళ్ళోవాళ్ళ కూతుళ్ళకు చేసేదానికన్న కన్నకూతురుకు ఎవరన్నా కాస్త ఎక్కువగానే జరుపుకోవాలా, వద్దా?

తనభార్య ఈధోరణిలో పడ్డప్పుడు శ్వేతాంబరం అస్త్రసన్యాసంచేసి వింటూ ఉండిపోయేవాడు. ఎందుకంటే గుణ అనే మాటల్లో వాక్యానికి రెండేసి అబద్ధాలుంటాయి. సరస్వతమ్మ కూతురు సుశీలకూ, కళ్యాణికి ఏమీ పోలిక లేదు. సుశీల చాలా తీరైనపిల్ల. తెలివిగలది. ఆపిల్లకు వచ్చిన సంబంధం గుణ చెప్పేటంత గొప్పది ఏమీకాదు

పిల్లవాడికిఆస్తిలేదు. రెండువందలు సంపాదిస్తున్నాడన్నమాటే గాని కనుబొమలమీద వెంట్రుకల్లాగా ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం. ఇంకా పదేళ్లుచేసినా అదేజీతంరావచ్చు. లేదా, రేపే ఉద్యోగం ఊడనూవచ్చు ఈ జీతంరాళ్ళల్లో ఇద్దరుతమ్ములకు చదువులు చెప్పిస్తున్నాడు. అందులోఒకడు కాలేజీ చదువు!—ఇంతాచేసి కుర్రవాడికి పలచనిజుట్టూ, మెల్లకన్నూ! తోలు ఎర్రగాఉంటే అందగాడైపోయాడా? ఇన్నిటికన్నా ముఖ్యమైనవిషయ మేమంటే ఈ సంబంధం కుదిర్చింది శ్వేతాంబరం కానేకాదు. ఆ కుర్రవాడి పినతండ్రి శ్వేతాంబరానికి బాల్యస్నేహితుడు. అందుచేత ఆ అబ్బాయి పిల్లనుచూడటానికి తననుకూడా వెంటపెట్టుకువెళ్లాడు...

కాని గుణ స్టీమ్‌రోలర్‌ను నడిపించిందంటే దాని ముందు ఏనిజము ఆగలేదు. దానిక్రిందపడి అన్నినిజాలూ రూపుమాసిపోవలసిందే! అందుచేత శ్వేతాంబరం మాట్లాడక ఊరుకునేవాడు.

* * *

సీత చాలావిషయాల్లో తండ్రిపోలికే శ్వేతాంబరానికి గల నిగ్రహమూ, తీక్షణమైన బుద్ధీ వచ్చాయి. అంతేగాక, ఆమె తండ్రిలాగా మానసికంగా ఏకాంతవాసిని, ఆపిల్ల తండ్రితోగాని, తల్లితోగాని, అక్కతోగాని చెప్పకుండా తన కడుపులో దాచుకున్న ఆలోచనలు చాలాఉన్నాయి. ఆ సంగతి శ్వేతాంబరానికి తెలీదుగాని గుణమణికి తెలుసు. "మీరు మాట మాట్లాడితే సీతను వెనకేసుకొస్తారుగాని, అది వట్టికూచి! దొంగ! అమ్మా" అనేదావిడ భర్తతో.

తమకుకలిగిన ఇద్దరాడపిల్లలనూ భార్యాభర్తలిద్దరూ కూడబలుక్కున్నట్టుగా పంచేసుకున్నారు. కల్యాణి అమ్మ పిల్ల! సీత నాన్నపిల్ల! శ్వేతాంబరం భార్యతో "నీకూతురు" అంటే నూరింట తొంభైపాళ్ళు కళ్యాణి అన్నమాటే, అదే విధంగా గుణమణికూడా సీతను గురించి మాట్లాడేటప్పుడు-ముఖ్యంగా దెప్పుగా మాట్లాడేటప్పుడు—"మీకూతురు" అని తీసేది.

ఈ పంపకం గురించి సీత చాలా చిన్నతనంనుంచీ ఎరుగును. అంతేకాదు, ఇందులో ఏదో క్రూరత్వం ఉన్నట్టు ఆ పిల్లకు తోచేది.

ఒక్క ఇందులోనేకాదు, భార్యాభర్తలమధ్య ఉండే సంబంధాలూ, తల్లిదండ్రులకూమధ్య ఉండే సంబంధాలు కూడా అత్యంత క్రూరమైనవిగా సీతబుద్ధికి తోచేవి. తన తల్లీ తండ్రీ ఎప్పుడు ఏ విషయం మాట్లాడినా వారి మాటల వెనక ఏదో పరస్పర విద్వేషం దాగి ఉన్నట్టు ఆ పిల్ల తెలుసుకోగలిగేది వాళ్ళు కూతుళ్ళ నిద్దరినీ పంచుకున్నారేమో, ఒకరిమీద ఒకరికిగల తేలిక భావాలూ, కసీ, విసుగూ ఒకరి పిల్లలమీద ఒకరు చూపించుకునేవారు—అదికూడా గోప్యంగానే!

సీత నిత్యమూ ఘర్షణపడే దంపతులనుకూడా చూసింది. కాని అట్లా పోట్లాడుకోవటం కంటె తనతల్లిదండ్రులు సాగించే మూకయుద్ధం మరింత కూ్రరంగా ఉన్నట్టుండేది. "శ్వేతాంబరంగారూ, గుణమణిగారుకూడా నిజంగా

ఎంతో అన్యోన్యంగా ఉంటారు!" అని ఎవరన్నా అనుకుంటూంటే సీత ఆశ్చర్యపోయేది,

ఆ పిల్లమీద తన ప్రభావం ఏమీలేదని గుణమణి బాగానే గుర్తించింది. కాని శ్వేతాంబరం మటుకు సీత అచ్చు తనలాటిందే అని ఆత్మవంచన చేసుకునేవాడు. ఒకటి నిజం. సీత మనస్సుమీదతలిదండ్రులిద్దరి ప్రభావమూ తక్కువే. జన్మతః ఆమెకు చాలావరకు తండ్రి పోలికలూ కొంతవరకు తల్లి పోలికలూవచ్చాయి. ఆమె ఎనిమిదేళ్ళు వెళ్లేదాకా తన తల్లిదండ్రులలో ఎవరు రైటో, ఎవరుతప్పో తెలుసుకోలేక పోయేది. ఆ తరవాత ఇద్దరూ చాలావరకు తప్పేననే నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడు సీతకు పద్ధెనిమిది నిండాయి. ఈ పదేళ్ళుగా ఆమెమీద తల్లిదండ్రులిద్దరి ప్రభావమూ కూడా లేదు.

తాను మానసికంగా, ధృఢంగా, బలంగా ఉండగలందులకు సీత చాలా ఏళ్ళుగా ఎవరూ ఊహించని కృషి చేసింది. ఈకృషి సఫలమయింది, కాని, దాని ఫలితాలు తల్లికి ఒక విధంగానూ, తండ్రికి ఒక విధంగానూ కనపడేవి. "అది కఠినురాలు, కఠినురాలు!" అనేది తల్లి. "నాపోలికే... పట్టుదల!... ఉండాలిసిందే!" అనేవాడు తండ్రి. "పట్టుదల ఏం కాదు—మొండితనం!" అనేదితల్లి.

సీత మానసిక దార్ఢ్యంకోసం కృషి చెయ్యటానికి కారణం కల్యాణే. కాళ్ళలో సత్తువలేనివాళ్లు దేన్నయినా ఆనుకుని నిలబడ్డట్టుగా, కల్యాణి ఎవరినో ఒకరిని ఆనుకునేది మానసికంగా తనకన్న పెద్దదై ఉండి తననే ఆనుకునేది.

ఎవరుకూడా కల్యాణి మోస్తరుగా ఉండరాదని సీత నమ్మకం. అయితే సీతకు తన అక్కమీద కోపం ఏమీలేదు. ఆమెకు ఎవరి అశక్తతమీదా కోపంలేదు. అక్కడే శ్వేతాంబరానికీ, సీతకూ తేడా. ఇతరుల అసమర్థతపట్ల శ్వేతాంబరం చాలా క్రూరంగా ప్రవర్తించేవాడు. తనభార్య తనకన్న తెలివితక్కువ మనిషి అని తెలిసినాక ఆమె తెలివితక్కువ తనాన్ని తన తెలివితో భర్తీ చెయ్యటానికి దాన్ని రెట్టింపు చెయ్యటానికి తన తెలివితేటలు ధారపోసేవాడు. గుణమణి మామూలు తెలివితేటలుగలవాణ్ణి చేసుకుని ఉంటే ఇంత కన్న రాణించి ఉండేది!...కల్యాణి విషయంలో కూడా తండ్రి ప్రవర్తన చాలా క్రూరంగా ఉన్నట్టు సీతకు తోచేది. ఒక ఇంట్లో, ఒక కుటుంబంలో ఉన్న మనుషులు ఒకరి నొకరు పరీక్షకుపెట్టి మార్కులువేస్తూ కూచోవటంతోనే సరిపోతే ఇకవీళ్లు కలిసి జీవించేదెప్పుడు? ఒకరికొకరు సహాయ పడేదెప్పుడు?

తనను చూసి తండ్రి గర్వపడే సంగతి సీతకు తెలుసు కాని, అందుకామె పెద్దగా సంతోషించేదికాదు. ఆయన కల్యాణినిచూసి ఎందుకు అవమానపడేవాడో, అందుకే తననుచూసి గర్వపడేవాడు—స్వాతిశయం! అంతకన్నా ఏమీలేదు. నిజంగా తండ్రి సహాయం ఎక్కువగా కావలసి నది కల్యాణికి. అయినా కల్యాణి విషయం వచ్చేసరికి తండ్రి చేతులు ముడుచుకున్నట్టుగా ప్రవర్తించేవాడు.

కల్యాణి పెళ్ళి ప్రయత్నాలు విషయం చూడరాదా?

ఆయన సరిఅయిన ప్రయత్నం చెయ్యటంలేదని తల్లి చేసిన ఆరోపణను సీత కూడా చాలావరకు ఆమోదించింది.

"రేపు సీతకు సంబంధం చూడాలంటే ఇట్లాగే తాత్సారం చేస్తారా?" అన్నది గుణమణి.

"సీతకి సంబంధం తీసుకురావటానికి అరనిముషం పట్టదు." అన్నాడు తండ్రి.

ఈ మాటకు సీత సంతోషించలేదు తనకు సులువుగా సంబంధాలు వచ్చేపక్షంలో ఆయన తన సర్వశక్తులూ ధార పోసి అక్కకే సంబంధం తీసుకురావచ్చుగద!

సీతకు ఇంకో విషయం కూడా తెలుసును. కల్యాణికి మంచి సంబంధం రావటానికి తను అడ్డుగా ఉన్నదని తన తల్లి నమ్మకం! ఆవిడ అట్లా అనుకోవటంలో తప్పేమీలేదు. కొన్ని సంబంధాల వాళ్ళు "మీ రెండో అమ్మాయిని చేసుకుంటాం" అని అనటం జరిగింది.

తన అక్కకు చాతయితే, సహాయపడాలని సీత ఉద్దేశంగాని, ఆమెకు ప్రతిబంధకంగా ఉండాలని కాదు. కాని, తాను చేయగలిగినదేమీ ఉన్నట్టు కనపడలేదు.

"జీవితం ఎంతక్రూరమైనది! ఎంతనిర్దాక్షిణ్యమైనది!" అనుకున్నది సీత.

* * *

కల్యాణికి సంబంధం వచ్చింది. వరుడు పాతికేళ్ళ వాడు. వాళ్ళకేమీ లేదుట. ఇతనుమటుకు రెండువందలయాభై

తెచ్చుకుంటున్నాడు. ఈకాలంలో పొడిబియ్యే అక్షరాలతో రెండువందలయాభై తెచ్చుకోవటం ఘనమే. కాని, ఈ అబ్బాయి ప్రకాశంవిషయంలో అంత ఘనంగా చెప్పుకోన టానికిలేదు. ఎందుకంటే అతనిపై పెద్ద కుటుంబభారం ఉంది. అతని అన్న చనిపోయాడు. ఆయన ప్రకాశంకంటె తొమ్మిది పదేళ్ళు పెద్దవాడు. క్రిమినల్ లాయర్‌గా మంచి ప్రాక్టీసుండేది. ప్రకాశం చదువంతా ఆయనే చెప్పించాడు. ఆయనకు అయిదుగురు పిల్లలు – అందులో ముగ్గురు ఆడ పిల్లలు! ఆయన ఆకస్మికంగా చనిపోవటంతో ఆయన కుటుంబ భారం ప్రకాశంపైన పడింది.

"అందుచేత నా సంపాదన నాకు ఏమూలా చాలదు. మా అన్న పిల్లల్లో ఆఖరువాడు తప్ప అందరూ చదువుకుం టున్నారు. నేను న్యాయంగా పెళ్ళిచేసుకోనే రాదు. నే చేసుకోబోయే భార్యతరఫునుంచి ఏదైనా ఆర్థిక సహాయం ఉండే పక్షంలోనే పెళ్ళాడతాను" అని ప్రకాశం పెళ్ళి చూపులకు వచ్చినప్పుడు కుండ పగలేసి చెప్పేశాడు.

అతను వెళ్ళటానికి లేచినప్పుడు శ్వేతాంబరం, 'సరే, నాయనా! నువ్వు వెళ్ళి రెండు. మూడు రోజులలో నీ నిర్ణ యం తెలియజెయ్యి. ఈలోపల మేంకూడా ఒక నిర్ణయానికి వస్తాం' అన్నాడు.

"నా నిర్ణయం నేను ముందే చెప్పేశానుగద! అధమం యింకో అయిదేళ్ళపాటు నేను మా అన్న కుటుం బాన్ని పోషించాలి. అప్పటికి పెద్ద కుర్రాడు కాస్త తన

కాళ్ళమీద నిలబడగలుగుతాడు. ఆతరవాత అంత ఇబ్బంది ఉండదు. కట్నంగా ఇచ్చినాసరే, నెలనెలా రెండువందలకు తక్కువ కాకుండా నాకు సహాయం చెయ్యగలిగినా సరే నేను పెళ్లికి సిద్ధంగా ఉన్నాను" ప్రకాశం చప్పున నవ్వి, 'ఇది ఒకబేరంకింద అడుగుతున్నా ననుకోకండి. నాకు వెనక ఆస్తిఉంటే నేనడిగేదానికి మూడింతలు అడక్కుండానే ఇచ్చి ఉండురు!...కాని, ఇది నా పరిస్థితి, దాన్ని దాచి లాభం లేదు' అన్నాడు.

"సరే, ఆలోచిద్దాం!" అన్నాడు శ్వేతాంబరం.

గుణసుణి ఎంతో ప్రయత్నంమీద తననుతాను నిగ్రహించుకుని ఉండాలి. ప్రకాశం గడపదాటగానే ఆవిడ అగ్నిపర్వతంలాగా బద్దలయింది.

"ఛీ ఛీ! ఎంత నాగరికతలేని మనిషి! 'నువ్వూ వద్దు, నీతో సంబంధమూ వద్దు' అని చెప్పెయ్యక ఆలోచిస్తామంటారేమిటి? ఏమిటుంది ఆలోచించటానికి? ఈ సంబంధానికి నేను చచ్చినా ఒప్పుకోను" అన్నదావిడ.

"అమాటే ఒక కారుముక్కరాస్తే పోలా! అతని మొహానే అనాలని ఏముందీ? అదిమాత్రం ఏంనాగరికతా?" అన్నాడు శ్వేతాంబరం.

"అటువంటివాళ్ళతో అట్లాగే ప్రవర్తించాలి!"

ఇది ఆవిడ తరుచు అనేమాటల్లో ఒకటి. తనకొక నాగరికత ఉన్నట్టు ఆవిడ ఎప్పుడూ ఒప్పుకునేదికాదు. అవతలివాళ్ళనుబట్టి కూడా ప్రవర్తించాలని ఆవిడ సిద్ధాంతం.

ఈ సిద్ధాంతాన్ని శ్వేతాంబరం ఏనాడూ అర్థం చేసుకోలేదు; గుణమణి ఆ సిద్ధాంతాన్ని విసర్జించనూ లేదు!

"అతన్ని మర్యాదగా పంపినందువల్ల నష్టం లేదు లే. అతను కుండబద్దలేసి తనసంగతి చెప్పినట్టే మనంకూడా కుండబద్దలేసి మనపరిస్థితి అంచనా వేసుకోవటం మంచిది కాదూ!" అన్నాడు శ్వేతాంబరం.

"ఇది పోగొట్టుకుంటే కల్యాణికి ఇంతోటి సంబంధం మరి రాదనేగా మీారనేదీ!" అన్నది గుణమణి తీవ్రంగా.

"నే నా మాట అనటం లేదుగాని ఈ సంబంధం మనం అనుకున్నంత తీసేసినది కాదేమోనని నా ఉద్దేశం" అన్నాడు శ్వేతాంబరం చాలా ఓర్పు అభినయిస్తూ.

"ఇంతకన్న చచ్చు సంబంధం మీారు కావాలన్నా తీసుకురాలేరు!" అన్నది గుణమణి, ఛాలెంజి చేస్తున్న దానిలాగా.

"నా కళ్ళకి కుర్రాడు చాలా అందంగా ఉన్నాడు. అతను కాస్త ప్రయత్నిస్తే ఏ సినిమా వాళ్ళయినా ఎగరేసుకుపోవచ్చు!"

"ఇంకేం; ఆపనే చేసుకోమనండి! చాతయితే మీారు కాస్త సహాయం కూడా చేసిపెట్టండి!"

"కాస్త తాపీగా ఆలోచించవలసిన సమయంలో నువ్వు కాస్త వేడెక్కిపోతావు. నే చెప్పేది కాస్త శ్రద్ధగా విను. ఇతని అన్న నెలకి రెండువేలు చొప్పున సంపాదించేవాట్ట.

ఆయనే ఇప్పుడు బతికుంటే ఈ సంబంధం మంచిదని నువ్వు ఒప్పుకునేదానివేనా?"

"బతికి లేడుగా!"

"ఆ మాట నాకు తెలీదూ!" అన్నాడు శ్వేతాంబరం ఓర్పు కాస్తా పోగొట్టుకుంటూ.

"తెలిసి ఎందుకడుగుతారూ! ఇది మంచి సంబంధమని నా చేత అనిపించటమేగా మీ ఉద్దేశం? ఇతనికి ఓ లక్షరూపాయల ఆస్తిపుంటే మంచి సంబంధమేనా, అని అడగరాదూ? ఉన్న సంబంధం ఉన్నట్టుగా ఆలోచించాలిగాని అయితేలూ, గయితేలూ ఇప్పుడెందుకంట!" అన్నది గుణమణి.

శ్వేతాంబరం అందామనుకున్న మాట అనే అవకాశమే లేకపోయింది. ఆయన హేతుబద్ధంగా మాట్లాడుదామనుకున్నప్పుడెల్లా గుణమణికి మరింత ఆవేశం వస్తుంది. ఈ సంగతి సీత తన చిన్నతనంనుంచీ కళ్ళారా చూస్తున్నది.

"మనం ఇంత ఘర్షణ పడేకన్న అమ్మాయి ఏమంటుందో తెలుసుకోవటంమంచిదికదూ!" అంటూ శ్వేతాంబరం కల్యాణికేసి చూశాడు.

కల్యాణి ఒక్కసారి తల్లివంకచూసి, "ప్రైవేటు మాస్టర్ని పెట్టినట్టు నెలజీతంమీద నాకు మొగుణ్ణిపెడతారా? నాకిష్టంలేదు ఆ మనిషి అంత స్పష్టంగా డబ్బుకోసం పెళ్ళి చేసుకుంటుంటే నేనెట్లా ఇష్టపడతానూ?" అన్నది.

శ్వేతాంబరానికి ఓర్పు కాస్తా పోయినట్టుంది. "నాకు తెలీకడుగుతాను, నీ అందం చూసి మురిసి చేసుకునే వాడే

అయితే వాడేపాటి అందగాడై ఉంటాడు? ఇంకోరి బండారం ఎంచేముందు మన బండారంకూడా ఎంచుకోవాలిగా" అన్నాడతను.

"అట్లా అయితే దానిఇష్టం ఎందుకడుగుతారూ? డబ్బుందిగనక దానికొక మొగుణ్ణి కొనిపారెయ్యండి, ఉద్ధరింపు అవుతుంది. అసలు మనకున్న సంస్కారమే అంత! అంతకంటె ఎక్కువఉన్నట్టు నటించటంకూడా దేనికి?" అన్నది గుణమణి.

"ఒకవేళ ఆ ప్రకాశంకోరిన షరతులు ఒప్పుకుని పెళ్లి నిశ్చయించాననుకో, నేను నాకూతురికి పనికిమాలినసంబంధం చేశానని నలుగురూ నన్నాడిపోస్తారా?" అని అడిగాడు శ్వేతాంబరం.

"నలుగురూ అనుకునేదానికీ, పెళ్ళాం పిల్లలు అనుకునేదానికీ ఏమీ తేడాలేదా?"

"పెళ్ళాంపిల్లలు పైత్యానబడి తెలుపును నలుపంటే దాన్ని శిరసావహించాలిసిందేనా?"

'ఇక వీళ్లు ఒకరికొకరు ప్రశ్నలుతప్ప వేసుకోలేరు!' అనుకున్నది సీత. తన తల్లిదండ్రుల ఘర్షణలో వివిధదశలు ఆపిల్లకు కొట్టినపిండి.

"ఎందుకండీ ఈ డొంకతిరుగుడు మాటలూ? ఈ సంబంధమే సీతకువస్తే ఇంతఆత్రంగా ఒప్పేసుకుంటారా?" అని అడిగింది గుణమణి. ఆవిడ అంచనాప్రకారం ఇది తన

భర్తకు మర్మాఘాతం! పడికట్టురాళ్ళలాగా ఆవిడకు ఇటు వంటి ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. వాటిని ఆవిడ చాలా "ప్రాక్టికల్"గా ఉపయోగించేది. ఒక్కొక్కసారి అవి ఫలితాలిచ్చేవికూడానూ.

"అయితే గింజులు నీకు సుతరామూ సరిపడవుగా" అన్నాడు శ్వేతాంబరం వెటకారంగా.

"నేనడిగినదానికి సమాధానం చెప్పరేం?" అన్నది గుణమణి.

"నాకు నువ్వనుకునే పక్షపాతాలేమీ లేవు. సీతకు సమ్మతమైతే నే నభ్యంతరం చెప్పను" అన్నాడు శ్వేతాంబరం.

"దానికి ఇష్టం లేదంటే శాపనార్థాలు పెట్టారుగా?" అన్నది గుణమణి.

శ్వేతాంబరం ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. తనకీసంబంధం ఇష్టం లేదని కల్యాణి అనగానే చర్చ ముగించిఉంటే ఆయన కింత విపత్తురాకపోను!

తలవనితలంపుగా సీత ఆయనకు సహాయమువచ్చింది.

"నేనైతే ఈసంబంధానికి ఒప్పుకుంటానమ్మా!" అన్నది సీత.

గుణమణి ఏదో అనటానికి నోరుతెరిచింది, కాని ఏమీ అనలేదు.

"అక్కకి మరొకసంబంధం చూచి పెళ్లిచేసేదాక ఇతను ఆగిఉండేట్టయితే నేను తప్పక చేసుకుంటాను. తనకు అన్న చదువుచెప్పించినందుకు కృతజ్ఞత కలవాడు బొత్తిగా మొరటుమనిషి అయియుండడు. మనకన్న నయమే అనుకుంటాను. అయినవాళ్ళమీద అపేక్ష చూపేవాళ్ళనుగురించి మనం – మనం – వేళాకోళంగా మాట్లాడుకోవటం నాకేం బాగాలేదు" అంటూ సీత కూర్చున్నచోటినుంచి లేచి అవతలికి వెళ్ళిపోయింది. మిగిలిన ముగ్గురూ ఆపిల్లకేసి నోళ్లు తెరుచుకుచూస్తూ ఉండిపోయారు.